



‘అబ్బా!’ బాధతో మూలుగుతున్న రాజవల్లి మెల్లిగా కళ్ళు తెరిచింది. ఎదుట ఉన్న వ్యక్తిని చూడగానే ఏదో జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్లు కనుబొమ్మలు ముడి పడ్డాయి. కోపం కళ్ళల్లో కదిలింది. అంత బాధలోను ప్రయత్నంగా పెదవులు ‘జోసఫ్’ అని సన్నగా గొణిగాయి.

“ఔను, రాజవల్లీ, నన్ను మీరు గుర్తుపట్టారన్న మాట.” రాజవల్లి ప్రాణం నిలబడేది ఇంక కొద్ది సేపే నని తెలుస్తూంది. కాని చెయ్యవలసినచికిత్సచేస్తూ డాక్టరుగా తన విధి నెరవేరుస్తున్నాడు జోసఫ్.

‘అసలు రాజవల్లి ఇలా చేయడానికి కారణం ఏమై ఉంటుంది?’ ఈ ప్రశ్నకి సమాధానం కావాలి జోసఫ్ కి.

“ఎవరో అమ్మాయి ఆత్మహత్య చేసుకొనేందుకు నిప్పంటించుకుంది. ప్రమాదస్థితిలో ఉంది” అని వినగానే ఏ భావము కలగలేదు మనసులో. డాక్టరుగా అటువంటివి అలవాటైపోయినందువల్లనో ఏమో? కాని ఆ అమ్మాయి రాజవల్లి అని గుర్తించగానే జాలితోపాటు ఆశ్చర్యము కలిగింది. ముఖం కొద్దిగా గుర్తించగలిగేట్టుగానే ఉంది. కాని ఎలాగైనా బాగా




ఆలోచించి జ్ఞాపకం తెచ్చుకున్నాకగానీ ఆ అమ్మాయిని రాజవల్లి అని తెలుసుకోలేకపోయాడు.

"నా జీవితం ఇలా అవడానికి, నేనీ రోజు ఇలా ఆత్మహత్య చేసుకోనడానికి ముఖ్యకారణం ఎవరో ఆ మనిషే నన్ను బ్రతికించడానికి ప్రయత్నిస్తున్నాడు. విచిత్రంకాదూ!"

"రాజవల్లీ!" విస్తుపోయాడు జోసఫ్ రాజవల్లి మాటలకు.

"ఔను. నువ్వే. పెళ్లి అనేది నా జీవితంలో లేకుండా చేశావు! నన్ని లోకంలో ఒంటరిదాన్ని చేశావు! నా కోసం కన్నీరు కార్చేవాళ్లే లేరు!" దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది రాజవల్లి.

"నా మాటవినండి. మీరిలా దుఃఖించకూడదు . ." జోసెఫ్ గొంతు గద్గద మయింది.

* * * *

"కాదు. నాన్నా. నేను కాలేజీలో చేరతాను."

"అలాగేనమ్మా. అలాగే." ప్రేమగా కూతురి తల నిమిరాడు శేషయ్య.

సంతానంలో మొదటి నలుగురు ఒకరి తరవాత ఒకరుగా ఈ లోకాన్ని వదిలిపెట్టి వెళ్లడంతో మిగిలిన ఒక్క కూతుర్ని ప్రాణంగా చూసుకుంటున్నారు రాజవల్లి తల్లిదండ్రులు.

'రాజవల్లి! అబ్బ! ఎంత చక్కని పేరు! అద్భుతమైన పేరు. పేరుకి తగ్గ మనిషి!" వెనకనించి మాటలు అంతకంతకి ఎక్కువవుతున్నాయి.

"శాంతా, తొందరగా నడుద్దాం!" భయంతో శాంత చెయ్యి గట్టిగా పట్టుకుంది రాజవల్లి.

"వెధవలకి ఏమి పని ఉండదు. వీళ్లనేంచేసినా పాపంలేదు. రాస్కెల్స్."

"ఊరుకో బాబూ. వింటారు." భయంతోను, కోపంతోను అడుగులు తడబడుతున్నాయి రాజవల్లికి.

"వింటే వీంచేస్తారేమిటి?" అలా భయపడతా వెందుకు? భయపడితేనే మరీ రెచ్చిపోతారు" విసుక్కుంటూ అంది శారద.

"కాదు శాంతా, ధైర్యంగా ఉంటే వాళ్లేమీ అనరని అనుకోడం పొరపాటు. ధైర్యంగా ఉండి కాస్త గట్టిగా మాట్లాడగలవాళ్లనిచూస్తే, నాలుగు తిట్టినా ఫరవా లేదు. మాతో మాట్లాడినట్టే లెక్క అనుకుని ఏవేవో వాగుతూనే ఉంటారు. ఇటు వాళ్లు అనే మాటలన్నీ వింటూ ఊరుకోనూలేం. అటు ఎదటపడి గట్టిగా నాలుగు మాటలు అననూ అనలేం." మరింత త్వరగా అడుగులువేస్తోంది రాజవల్లి.

రోజూ కాలేజీనుంచి ఇంటికి వచ్చేటప్పుడు ఇదొక గండం రాజవల్లికి. "ఆ వాగేది ఎవడో తెలుసా?" అడుగుతూంది శాంత.

"నాకేం తెలుసు?"

"వాడిపేరు జోసఫ్. ప్రైవరియర్‌లో ఉన్నాడు. రోజూ ఇలా వాగుతూ మన వెనక వచ్చేది వీడే. చదువులో పరవాలేదు. బాగానే చదువుతాడు. మరి ఈ అల్లరేమిటో?"

ఇంటికి చేరగానే 'అమ్మయ్యో! పీడ వదిలింది' అనుకుంది రాజవల్లి స్వేచ్ఛగా గాలిపీలుస్తూ. పార్వతి గుర్తుకువచ్చింది. తెలివిగలది పార్వతి. అన్నిట్లోనూ ఫస్ట్ వస్తుంది. కానీ ఏం లాభం? వాళ్లమ్మగారు పార్వతిని కాలేజీలో చేర్పించడానికి ఇష్టపడలేదు. ఒకరో జడిగితే ఆవిడ అంది. "దానికి పెద్ద చదువులు చెప్పించాలనే ఉంది. తెలివిగలది, బాగా చదువుతుంది కూడానామె. కానీ ఈ కాలేజీ కుర్రాళ్లు తిన్నగా ఉంటారా? ఏవో గొడవలు లేవదీస్తూ ఉంటారు. సగం మంది అల్లరిమూకే ఉంటారు. వాళ్ల చదువుకోసం వస్తారా ఏమన్నానా? మా ఇంట్లో నేనూ, అదీ తప్ప మగవాళ్లెవ్వరూ లేరు, కుర్రాళ్లు ఏదైనా అల్లరిపెట్టినా గట్టిగా చెప్పడానికి?" ఆవిడ మాటలు విన్నాక 'కాలేజీ కుర్రాళ్ల అల్లరికి భయపడి ఎంతమంది వాళ్లపిల్లల్ని కాలేజీలో చేర్పించటం లేదో ఏమో?' అనుకుంది ఆ రోజు.

* * *

రాజవల్లి వెయిటింగు రూమ్‌లోకి వచ్చేసరికి, అంతవరకు గొణగొణధ్వనిగా ఉన్న ఆ గది ఒక్కసారిగా నిశ్శబ్దాన్ని నింపుకుంది. అందరుకూడా రాజవల్లి ముఖంకేసిచూస్తూ చెవులు కొరుక్కుంటున్నారు. తెల్లబోయింది రాజవల్లి. శాంత ఒక్కతే, ఒకమూల కూర్చుని చదువుకుంటూంది. రాజవల్లి వెళ్లి శాంత పక్కన కూర్చోగానే మళ్లీ రూమ్‌లో ఎప్పటిలాగానే కాకిగోల మొదలయింది. మెల్లిగా అడిగింది రాజవల్లి "నేను వచ్చేసరికి అంతా ఒక్కసారిగా నిశ్శబ్దం అయి పోయిందెందుకు శాంతా?"

"వీళ్ళు కాలేజీలో చదువుతూ కూడా ఇంకోళ్ల మీద రహస్యంగా కబుర్లూ, ఆ గుసగుసలూ ఏమిటి చెప్పు?" శాంత మాటల్లో కోపం తొంగిచూసింది.

"అసలింతకీ . ." అర్ధోక్తిలో ఆగింది.

"నువ్వేం బాధపడకు వల్లీ. పనిలేనివాళ్లు ఏవో మాటలంటూనే ఉంటారు. చెయ్యి దురదగా ఉన్న వాళ్లు ఏవో పిచ్చిరాతలు రాస్తూనే ఉంటారు."

శాంత మాటలకు ఆశ్చర్యంగా చూసింది రాజవల్లి.

"ఏమిటి శాంతా, రాయడం ఏమిటి? అసలు సంగతి చెప్పు."

"ఎందుకులెద్దూ అవన్నీ. చదువుకుందాం కాసేపు."

"కాదు శాంతా. ప్లీజ్. ఏదో నా గురించే అయి ఉంటుంది. లేకపోతే వీళ్లంతా నా వంక అలా ఎందుకు చూస్తారు?"

"చెబుతానుగానీ నువ్వుమాత్రం ఇలాంటివేవీ పట్టించుకోకు. కాలేజీ అన్న తరవాత ఇటువంటి గొడవలు మామూలే. వాటినే తలుచుకుంటూ చదువు పాడు చేసుకోడం మంచిదికాదు. ఆ జోసఫ్‌గాడు లేడూ వాడి పనే. గోడలనిండా రాజవల్లి, జోసఫ్ అని రాసి పెట్టాడు."

పిడుగు పడినట్లయింది రాజవల్లికి ఆ మాట వినగానే.

"ఛీ. కాలేజీలో చేరకపోయినా బాగుండేది."

"అదుగో అదే వద్దనేది. ఎవడో రౌడీ ఏదో రాశాడని దాన్ని గురించి అంతబాధ ఎందుకు? ఇవాళ నేను కాలేజీకి వచ్చేటప్పటికి ఆడపిల్లలు ఎవరు ఇంకారాలేదు. మన వెయిటింగ్ రూమ్ పక్కగోడమీద బొగ్గుతోటి "రాజవల్లి, జోసఫ్" అని ఆ జోసఫ్ రాస్తుంటే నా కళ్లతో నేను చూశాను. నన్నుచూసి వాడు త్వరగా అక్కడినించి వెళ్లిపోయాడు. దాన్నిబట్టే నేను తెలుసుకున్నాను, మిగతా గోడలనిండాకూడా వాడే రాశాడని."

ఆ రోజునించీ కాలేజీలో నడవడానికే భయం భయంగా ఉంది రాజవల్లికి.

* * * *

"నాకు ఉత్తరాలురాసే మహానుభావు లెవరుబాబూ" నవ్వుతూ కవరు చింపింది రాజవల్లి.

## తమిరిశ జానకి

ఉత్తరం చదివి శాంత ఒళ్ళో పడేసి రెండు చేతు ల్లోనూ ముఖందాచుకుని కూర్చుండిపోయింది.

"ఛ. ఏమిటిది వల్లీ, మరీ అంత పిరికిదానివై పోతావెందుకు?" ఆ ఉత్తరం చదివి, రాజవల్లి పక్కన కూర్చుని ఓదార్పుగా అంది శాంత.

"ఊరుకో వల్లీ, ప్రిన్సిపాల్‌కి రిపోర్టు ఇద్దాంలే."

కళ్ళు తుడుచుకుంది రాజవల్లి. "ఆ ప్రిన్సిపాల్ ఎలాంటివాడో నీకుమాత్రం తెలియదా శాంతా? స్నేహితుల పిల్లల్ని, డబ్బున్నవాళ్ళ పిల్లల్ని ఎంత అల్లరి చేసినా వదిలేస్తాడు. వాళ్ళనేమీ అనడు. మరి అలాం టప్పుడు మనం రిపోర్టు ఇస్తేమాత్రం ప్రయోజనం ఏమిటి? నలుగురికీ ఈ విషయం తెలియడం తప్ప లాభం ఏమీ ఉండదు."

నిజమేననిపించింది శాంతకికూడా.

జోసఫ్ రాసిన ప్రేమలేఖ చింపి ముక్కలు ముక్కలు చేసింది రాజవల్లి.

* * *

ఆ తరవాత అలాగే నాలుగైదు ఉత్తరాలువచ్చాయి రాజవల్లికి జోసఫ్ రాసినవి.

"నేను చదువు మానేస్తానని మా నాన్నతో చెప్పే స్తాను శాంతా" అంది ఒక రోజున.

"అలాంటి పిచ్చిపని చెయ్యకు. పరీక్షలు కొద్ది రోజులే ఉన్నాయి. ఇప్పుడు మానెయ్యడమేమిటి?" చిన్నగా మందలించింది శాంత.

* * * *

ఆశ్చర్యంతో వింటూ అలాగే నిలబడి పోయింది రాజవల్లి గది బయట. లోపలినించి తండ్రిగొంతు వినిపిస్తోంది.

"మనమ్మాయి మంచితనం మనకి తెలుసు. లోకులు కాకులని ఊరికే అన్నారా? అందులో ఆడవాళ్ళకి లేని పోనివి కల్పించి వార్తలు ప్రచారం చెయ్యడం అదో సరదా. ఊళ్ళోవాళ్ళు ఏదో వాగుతూనే ఉంటారు. అది నిజమైతే కదా మనం బాధపడటానికి. అనవ సరంగా అడిగి దాన్ని బాధపెట్టడం, మనం బాధపడటం ఎందుకూ?"

కాలికింద భూమి కదలినట్లయింది రాజవల్లికి. ఇంకా ఏదో అంటున్నాడు తండ్రి. మనసు పనిచెయ్యడం మానేసి ఆ మాటలు వినిపించుకోలేదు. కానీ తండ్రి నోటివెంట వచ్చిన "జోసఫ్" అన్న మాటమాత్రం చెవుల్లో దూరింది. ఇంక ఒక్కనిమిషం కూడా అక్కడ నిలబడలేక ఇవతలికి వచ్చింది.

'ఊళ్ళోవాళ్ళు చెప్పుకోడం ఏమిటి? అంటే ఊళ్ళో కొంతమందికి ఆ జోసఫ్‌గాడు చేస్తున్న రాజవల్లి నామస్మరణ తెలిసిపోయిందన్నమాట.' ఆ ఆలోచన రాగానే బాధతోనూ, సిగ్గుతోనూ కుంగిపోయింది రాజవల్లి మనసు.

* * *

అందరి పరీక్షలు ముగిశాయి. జోసఫ్ కుటుంబం ఊరినుండి మకాం మార్చింది.

శాంత పెళ్ళిచేసుకుని అత్తవారింటికి వెళ్ళిపోయింది.

డబ్బు ఇబ్బందితో రాజవల్లి చదువు ఆ ఏడు స్వస్తి పలికింది. కూతురి పెళ్ళికి ప్రయత్నిస్తున్నాడు శేషయ్య. శేషయ్య అంటే కిట్టని కొందరు పెద్దలు రాజవల్లికి పెళ్లి సంబంధాల్ని లేనిపోనివి కల్పించి చెప్పి తిరగ గొడుతున్నారు, కావలసినంత డబ్బుండి ఏ పనీ లేని పెద్దలు వాళ్ళంతా. వాళ్ళకి ఇదొకరకమైన కాలక్షేపం. ఆ పెద్దలు వచ్చిన సంబంధాలకు పుకారులు కథలుగా అల్లి చెప్పేదిది. "రాజవల్లి కాలేజీలో ఒకణ్ణి ప్రేమిం చింది. వాణ్ణితప్ప ఎవర్నీ చేసుకోనంటే వాళ్ళనాన్న వెళ్లి ఆ అబ్బాయి తరపు పెద్దవాళ్ళని కలుసుకుని మాట్లాడితే వాళ్ళు ఒప్పుకోలేదు. కులంకాని వాడిని ప్రేమించింది. దాన్నిబట్టే తెలుస్తోంది వాళ్ళ వంశం అంతా ఇటువంటి గుణాలున్నదేనని." ఇదీ వాళ్ళుచేసే ప్రచారం.

'మనసు, బుద్ధిలేని మనుషులు చేసే ప్రచారాలకు, పుట్టించే పుకార్లకు ఎంతమంది జీవితాలు బలి అవు తున్నాయో'నని మథనపడేది రాజవల్లి.

సంఘంలో ఉన్న నిస్సహాయుల్ని పీడిపించుకుతినే కర్కోటకుల్ని తల్చుకుంటే కోపంతోపాటు చెప్పలేని ఆశ్చర్యంకూడా కలుగుతూంది. తన తండ్రే కనక ధనవంతుడై ఉంటే ఈ కథలల్లే పెద్దమనుషుల ప్రవర్తన ఇలా ఉండేదా? ఏడవలేక నవ్వుకునేది అలా ఆలోచిస్తూ. రోజులూ, వారాలూ, నెలలూ గడిచి పోతున్నాయి.

అసలే ఆరోగ్యం సరిగా ఉండని శేషయ్య దిగులుతో మంచంపట్టి కొద్దిరోజుల్లోనే భార్యకీ, కూతురికీ మనసుల్లో మరింత వేదనపెంచి, తానుమాత్రం ఇత రుల బాగుచూచి ఓర్వలేని పెద్దలకు దూరంగా తప్పు కున్నాడు.

అమిత దుఃఖంతో ఆ నాలుగు గోడల మధ్యే కుమిలి పోతున్నారు తల్లీ కూతుళ్ళు.

చివరికో రోజున రాజవల్లి అంది. "మనమీఊళ్లో ఉండలేమమ్మా. ఇంకో ఊరు ఏదైనా వెళ్లిపోదాం."

"మనవాళ్ళంటూ మన కెవరూలేరు. ఎక్కడికని పోతాం?"

"అలా ఎందుకమ్మా అనుకోడం? నా చదువుకి ఏ పెద్దపనీ నాకు దొరకదు. నిజమే. కానీ ఇప్పుడు పెద్ద పెద్ద ఊళ్లల్లో మహిళా సంఘాలు చిన్నపిల్లలకి చదువుకూడా నేర్పిస్తున్నాయి. ఆఖరికి వాళ్ళని ఆడించే పని నాకు దొరికినా చాలు."

"అసలే నా ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. ఏ క్షణాన పోతానో" తల్లి మాటలకి అడ్డు తగిలింది రాజవల్లి "ఊరుకోమ్మా. నీకేం పరవాలేదు."

"కాదు వల్లీ. నీకోసం నేను బతకాలి తప్ప. లేకపోతే ఇంక ఈ లోకంలో . ." కన్నీళ్ళు తుడుచుకుంది కాంతమ్మ.

ఆ తరవాత రెండు మూడు రోజులకే తల్లిని తీసు కొని ఆ ఊరినించి వచ్చేసింది రాజవల్లి.

ఇంకో ఊళ్ళో స్థిరపడిన రెండు రోజులకే విధి పగ తీర్చుకున్నట్టు దండెంమీద చీరవేస్తున్న కాంతమ్మ పడిపోయి మరి లేవలేదు. కళ్లల్లో నీళ్ళు ఇంకిపోయే వరకూ రోదించింది రాజవల్లి.

'ఇంక ఎవరికోసం తను జీవించాలి?' అన్న ప్రశ్న తప్ప మరేమీ కనిపించలేదు. తల్లికోసం తను బ్రతకా లనుకుంది. డబ్బు సంపాదించి తల్లికి ఆరోగ్యం చేకూర్చాలనుకుంది. కాని ఇప్పుడింక తను ఎవరికోసం జీవితం సాగించాలి. ఈ ప్రశ్నకి సమాధానం లేదను కుంది. తత్ఫలితమే ఆత్మహత్య. ఆ ఇంటివాళ్ళు పోతూ పోతూ ఉన్న ప్రాణంతో ఆస్పత్రికి చేర్చారు.

* * *

అవే తన ఆఖరి మాటలుగా, ఎంతో కష్టంమీద ఆయాసపడుతూ అంది రాజవల్లి. "నాగతి ఇలా కావడానికి, పెళ్లి అనేది నాకొక గగన కుసుమం అయ్యేం దుకు కారణం నువ్వు. వివరించి నేనిప్పుడు చెప్పలేను."

మాట్లాడవద్దని చేత్తో వారిస్తున్నాడు జోసఫ్.

కానీ ప్రాణంపోయేముందు కొందరికి వాళ్ళ మన సులో మాటలు, ఆఖరి మాటలు చెప్పడానికి ఓపిక దానంతటదే వస్తుందో ఏమో?

"నీ జ్ఞాపకాల . . తెరలో ఉన్న ఈ రాజవల్లి ఇంకొన్ని రోజుల్లో ఎలాగో మాసిపోతుంది. అందుకని... నువ్వు . . నువ్వు . . నా గురించి మనసు పాడు చేసుకోకు. కానీ . . ఒక్కటి . . కాలేజీలో నాపేరు నీపేరుతో కలిపి గోడల కెక్కించి నాకు ఉత్తరాలురాసి, నన్ను నవ్వులపాలు చేసినందువల్ల నీకేమైనా లాభం కలిగిందా? . ." చివరిమాటలంటూనే శాశ్వతంగా కళ్ళుమూసింది రాజవల్లి. జోసఫ్ కళ్ళనుండి ఒక కన్నీటి బొట్టు రాజవలి నుదుటిమీద వేడి ముత్యంలా మెరిసింది. ★

నేత్రరక్షణకు, సౌందర్య పోషణకు



దర్బార్ కాటుక (రిజిష్టర్డు)

మరియు

దర్బార్ గంధ్ (తిలకము)

నేత్రజ్యోతి సుర్మా

స్పెషల్ కుంకుమ వగైరా

రాంబీర్ కం., బొంబాయి-4. BR.